# 7. మరలం కాదు, మనుషులం

"అదే కట్టుకున్న పెళ్ళాం అయితే ఫాట్‌మని ఓ లెంపకాయ లాగి ఉందును. ఈ దిక్కుమాలిన పని చేసింది కన్నతల్లై కూచుంది కర్మ, కర్మాని!"అని చిదంబరం తలపట్టుకు కూచున్నాడు. ఆఫీసరు ముందు ఇంత రెడ్‌హేండెడ్‌గా పట్టుబడిపోతానని అతను జన్మలో అనుకోలేదు. సాంబుగాడి పెళ్ళికి వెళ్ళడంకాదు గాని నిలువునా తన కొంపమునిగిపోయింది. ఓసారి పెళ్ళి పందిట్లో అడుగుపెట్టాక కాలం అనేది ఇక మన చెప్పుచేతల్లో ఉంటుందా! ఏ క్షణానికి ఆ క్షణం రైలెక్కేస్తానని పైపైకి బెదిరించినా అందరు ఫ్రెండ్సుని ఒక్కసారి కలుసుకున్నాక వాళ్ళ కంపెనీ అంత త్వరగా వదిలేది కాదని తన లోలోనిది గుర్తు చేస్తూనే ఉంది. పేరుకి సుముహూర్తం అంటారుగాని అదెప్పుడు జరిగిపోయిందో ఎవడికి జ్ఞాపకం? పేకాటపెట్టారు. మందుపార్టీ ఏర్పాటు చేశారు. వీటన్నిటినీ మించి ఎన్ని రాత్రిళ్లూ పగళ్లూ చెప్పుకున్నా తరగని, ఏ నిర్వచనానికీ అందని, అనుభవించిన వాళ్ళకే తప్ప తెలియని, ఒకే విశ్వవిద్యాలయంలో ఏళ్ళ తరబడి చదువుకుని ఎక్కడెక్కడో ఉద్యోగాల్లో స్థిరపడి ఒకే చోటుకి యిలా చేరుకున్న ఓ వయసువాళ్ళ కలయిక యిది. మనిషి బతికేది దేనికోసం? అని ఆ క్షణంలో వాళ్ళని ఎవర్నయినా అడిగితే "తల్లిదండ్రుల సేవలకీ కాదు, ఆలుబిడ్డల పోషణకీకాదు, ఇదిగో ఇలాంటి మధురానుభూతులకోసమే!" అని తడుముకోకుండా టక్కున జవాబు చెబుతారు. కాని ఏం లాభం? స్నేహం పీచుమిఠాయి. ఆ అనుభవం తాత్కాలికం! నిత్యం ఉండేది జీవితం. అది ఓ బండరాయి.

"సాబ్ కిసీసే జరూరీ బాతే కర్ రహేహై ఆప్ థోడీ దేర్ ఇంతజార్ కీజియే"

అనే ప్యూన్ రామ్‌లాల్ మాటతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాడు చిదంబరం. చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ మన్‌మోహన్‌సిన్హా చాలా మర్యాదస్థుడు. ఈ యూనిట్‌కి వచ్చి ఇంకా రెండు నెలలయినా అవలేదుగాని అప్పుడే హైలీ ఎఫిషెంట్ ఎండ్ డిసిప్లిన్డ్ అని పేరు తెచ్చుకున్నాడు. తనమీద డిసిప్లినరీయాక్షన్ వెంటనే తీసుకోడానికి అవి చాలు. ఆ ఉరి శిక్ష ఏమిటో వెంటనే చెవిని పడక ఎంత ఘోరయాతన ఈ "ఇంతజార్ కర్‌నా?' చెప్పాలంటే ఈ హిందీయే తన కొంప తీసింది. చిదంబరం తల్లి బాలమ్మకి ఆభాష బాగా రావడమే అతన్ని ప్రస్తుతం ఇంతటి చిక్కుస్థితిలో పడెయ్యడానికి మూలకారణం!

"మా తాతగారికి రైల్వేలో ఉద్యోగంకాదు గానీ, నా చిన్నతనమంతా ఇంచుమించు మధ్యప్రదేశ్, బీహారుల్లోనే గడిచింది. మేం ఉండే ప్రాంతాలలో సాధారణంగా హిందీయే మాట్లాడేవారు. మాకూ అదే అలవాటై పోయింది. పెళ్ళయాక యిలా మనవైపు స్థిరపడిపోయానుగాని ఇప్పటికీ మీ నాన్నగారు నాకు తెలుగు సరిగ్గారాదని దెప్పుతూనే ఉంటారు" అనేది కొడుకుతో బాలమ్మ.

'మీ ప్రాజెక్ట్ ఏరియాకి వచ్చి, అక్కడంతా హిందీయే అన్నావుకదా. నాలుగు రోజులుండి, అందరిళ్ళకీ వెళ్ళి కరువుతీరా మళ్ళీ ఆ ముక్కలు మాట్లాడాలనుందిరా చిదంబరం! అంతేకాదు. నువ్వెంత చెప్పినా కోడలికి ఆ భాష రాలేదనీ, నలుగురితో తిరగ లేకపోతోందనీ గొడవ పెడుతున్నావుటగా! నెమ్మదిగా చెప్పుకోవాలిగాని గుడ్లెర్రజేస్తే ఎలా? నేవచ్చి మప్పుతానుగా! సూర్యానికి

కూడా పెళ్ళై వెళ్ళిపోయాక నాకు బొత్తిగా తోచడంలేదు. నువ్వేం శెలవుపెట్టుకువచ్చి నన్ను తీసికెళ్ళనక్కర్లేదు. ఆడుఁళ్ళన్నీ నాకు కొట్టిన పిండే. ఎప్పుడు రమ్మన్నావు?' అని కొడుక్కి రాసింది. అమ్మని రమ్మని రాద్దామనే అనుకుంటున్నాను. అలా రోజులుగడిచి పోయాయి. ఇంతలో తప్పనిసరై తలవని తలంపుగా సాంబుగాడి పెళ్ళికెళ్ళవలసి వచ్చింది. ఎన్నాళ్ళకోదొరికిన ఆ తీయని అనుభవం మైకంలో శలవు పొడిగించవలసి వచ్చింది.

వస్తూనే గుమ్మంలోనే తల్లినిచూసి తెల్లబోయాడు చిదంబరం! 'తీరా నేను వచ్చేసరికి ఎక్కడికిరా చెక్కేశావ్? పోన్లే, నా కొడుకువి కాదూ నువు? నేనేం రాసి రైలెక్కానా, నువ్వేం చెప్పి చక్కెర్లు కొట్టడానికి? అంటూ నోరు విప్పింది. ఎక్స్‌ప్రెస్ రైలు ఆపడానికయినాలోపల అలారం గొలుసూ, బయట పచ్చజండాలూ పని చేస్తాయి. కాని బాలమ్మగారి వాక్ప్రవాహం అరికట్టే సాధనం మాత్రం ఇకముందు కనిపెట్టబడాలి. "ఎవడో స్నేహితుడి పెళ్ళికని బయలుదేరావటగా, వెళ్ళిన వాడివి ఏదో లగ్గానికి హాజరయ్యాననిపించి వెంటనే తిరుగు రైల్లో వచ్చేస్తావా, ఏకంగా మేకు కొట్టినట్టు అక్కడ వారం రోజులు భైఠాయిస్తావా? వయసయితే వచ్చి పెళ్లామయితే కాపరానికి వచ్చిందిగాని, నీకేం బాధ్యత అన్నది వంటపట్టినట్టులేదే? మన వాళ్ళు అంటూ మాటవరసకైనా ఒక్క కుటుంబం కనుచూపుమేరలోలేదు. వీళ్ళు మాట్లాడే ఒక్క ముక్క అయినా తనకి అర్థం కాకుండా బిక్కుబిక్కుమని పాపం నిన్న మొన్నటి పసిపిల్ల ఆకోడలు యీ అడవిముండాఁళ్ళో ఎలా గడుపుతుందనుకున్నావ్. సమయానికి అనుకోకుండా నేనొచ్చి ఆదుకోబట్టి సరిపోయిందిగాని..." ఇంతకీ బాలమ్మ కోడలితో నాలుగు గోడల మధ్య గడిపింది బహు తక్కువ. నలుగురు పిల్లలూ అత్తగారూ ఉన్న సొంత యింట్లోనే, మధ్యాహ్నం మూడు దాటాక ఎట్టి పరిస్థితిలోనూ ఆవిడ కాలునిలబడేదికాదు. ఇంతదూరం వచ్చాక తన చిన్నప్పటి భాష తెలిసిన మొహాలు నాలుగూ చుట్టుపక్కల కనిపించాక ఇక ఆవిణ్ని ఆపడం ఎవరితరం?

మొహమాటాలూ ముందుపరిచయాలూ బాలమ్మ ఎరగని విషయాలు. వచ్చిన మధ్యాహ్నమే మన్‌మోహన్ సిన్హాగారి తలుపు తట్టేసింది. అంతకుముందు అక్కడి మేమ్ సాబ్ లందరూ రావుబాబు శ్రీమతీజీ అందమైన కళ్ళకి ఆకర్షితులైనా ఆవిడ నోటంట ఒక్కముక్క ఊడిపడక పోనీ ఆ చూపుల్లో అయినా ముడుచుకుపోయే స్వభావమేగానీ స్నేహభావం వెతికినా గోచరించక ఎక్కడి వాళ్ళు అక్కడే ఉండిపోవలసి వచ్చేది. బాగా ముందుకి తన్నుకు వచ్చిన పలు వరుసా, నేరేడు పండు రంగు మైచాయా, బాలమ్మని చూసిన వాళ్ళకి మొదట్లో కొంచెం జంకు కలిగించినా, అనర్గళంగా వాళ్ళ భాషలోమాటాడ్డం, అన్నిటినీమించి ఆ కలుపుగోలుతనం వాళ్ళందర్నీ ఆనందాశ్చర్యాలలో ముంచితేల్చాయి.

"ఆ సిన్హానో ఎవడో నీకు పెద్దాఫీసరు అయి ఉండొచ్చుగాని నాకే భయం, నా నోటికి దేనికని అడ్డు? ఇంతకీ వాళ్లందరూ నన్ను ఎంతగానెత్తిమీద పెట్టుకున్నారో... మొగుళ్ళ ఉద్యోగాల కోసం పాపం ఇంతింత దూరం వచ్చారుగాని వీళ్ళకి అన్నీ అప్పుడే కాచి వడపొయ్యడానికి ఏమంత వయసుందని? అదిగాక మన వంటలు అంటే పడి చస్తారు. చేసి చూపిస్తే ఎంత తేలికో అని గుడ్లు తేలేస్తారు. ఇడ్లీ చేసి యిచ్చాను. పెసరట్టు నేర్పేను. చక్రపొంగలీ, బొబ్బట్లూ చేసి పంపాలి ఇవాళో

రేపో...అన్నట్టు మీ సిన్హా తండ్రికికూడా డయబెటీస్ ఉందిటగా...నాకూ మొదట్లో కొంచెం సుగరు ఉండేదనీ పెందరాడే రోజూ ఇంత కాకర రసం తాగితే యిట్టే తగ్గిపోయిందనీ చెబితే వాళ్ళెంత ఆశ్చర్యపోయారో!

"అయ్యో అమ్మా, చేజేతులా నీకొడుకు భవిష్యత్తు నాశనం చేశావు కదే!" అని జుత్తు పీక్కున్నాడు చిదంబరం. ఇంకా తను కన్‌ఫర్మ్ కాలేదు గనక వరసగా ఎక్కువరోజులు ఎట్టి పరిస్థితుల్లోనూ శలవు ఇవ్వరు. పెళ్ళికంటే శలవు ఇవ్వరని, తల్లికి డయబెటీస్ ముదిరిపోయిందని బొంకి శలవు పెట్టి వెళ్ళాడు తను. తీరా అక్కడ చిక్కుపడిపోయాక "హార్ట్ ఎటాక్ వచ్చి తల్లి హాస్పిటలైజ్ అయిందని ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం కొట్టడమే కాక, ఓ మెడికల్ సర్టిఫికెట్ జోడించి వేరే కవరు కూడా రాశాడు. ఈ దేశంలో కన్నతల్లి ఉపయోగం యింతకన్న ఎక్కువగా ఏముంది! అదే, 'చావు ముఖాన ఉన్న తల్లి' యిక్కడ ప్రత్యక్షమై, అలసటా ఆపూ లేకుండా ఎక్కిన గుమ్మం ఎక్కకుండా, చెప్పిన కబురు చెప్పదని చిదంబరం యేంకలగన్నాడా! ఈ నేరానికి తనకి మరీ తక్కువ శిక్ష "అగ్ని గుండాలు"కి బదిలీ.

"సాబ్‌నే బులాయా" అనే రామ్‌లాల్ పిలుపుతో ఉలిక్కిపడి, దడదడలాడే గుండెతో లోపలికి వెళ్ళేడు చిదంబరం, ముఖానికి అడ్డుపెట్టుకున్న హిందీ డెయిలీ పక్కకి తొలగించి చిదంబరం కళ్ళలోకి చూస్తూ పక పక నవ్వేశాడు సిన్హా. "సారీ ఫర్ ది డిలే" అంటూ ఆ తర్వాత అతను చెప్పిన మాటల్లో ఏ ఒక్క అక్షరమూ చిదంబరం జన్మంతా మరచి పోలేడు.

"వెనక నేను సీనియర్ ఇంజనీర్‌గా ఉన్నప్పుడు యిలాంటి అవస్థలోనే పడ్డాను, రావు బాబు! అది గుర్తొచ్చి నాకునవ్వాగడం లేదు. ఓ సారి లక్నోలో వరసగా ఓ వారం రోజుల పాటు వరసగా పాత బెంగాలీ సినిమాలు వేశారు ఆ యిష్టానికి తట్టుకోలేక నేనూ నిరుపమా ఉండిపోయాం. ఇలాగే నేనూ దొంగ టెలిగ్రాము యిచ్చాను, శలవు దరఖాస్తు మా పితాజీకి యాక్సిడెంట్ అయిందని. మేం వస్తున్నప్పుడు ఆ రైల్లోనే మా బాస్ ఎక్కాడు. పితాజీకి ఏమయిందని పరామర్శ చేశాడు. "ఈయన ఇలా స్కూటర్ మీద వెడుతున్నారండి, అప్పుడే మలుపు తిరిగి వస్తున్న ఎద్దుబండి గుద్దేసింది. ఇంకానయం కుడి చెయ్యి ఎగిరిపోను" అని కల్పించి చెప్పాను. మా నిరుపమది అంతా హడావిడిరకం. పైగా పుట్టెడు చెవుడు, నేను చెప్పిందేదో వినిపించుకోకుండా ఏదో యాక్సిడెంట్ గురించే కదా చెబుతున్నానని తనూ మధ్యలో కలిపించుకొని 'అవునండీ, మా మామాజీకి తగిలింది మామూలు దెబ్బా? ఎడమకాలు ఇంచుమించు పచ్చడైంది, ఇంకా మా అదృష్టం కొద్దీ బతికారు. ఆయన వెళుతున్న రిక్షాని ఎదురుగా వస్తూన్న కారు ఢాష్ యిస్తే ఏమౌతుంది మరి?"అని చెబుతుంటే బాస్ తెల్లబోయిచూస్తుంటే, నాకు నవ్వాగలేదు ఇలాగే. విషయం పోల్చి ఆయనా మాతో శ్రుతి కలిపాడనుకోండి ఇలాటివి మామూలే." అంటూ చిదంబరం నుంచి అందిన ఉత్తరం అతని ముందే చించేస్తూ 'రూల్సు అనేవి పేరుకి ఉంటాయి. వాటి ముందు ఫూల్సు కాకుండా మనం జాగ్రత్త పడాలి. సంతకాలుచేసిన ఉత్తరాలెందుకు, టెలిగ్రాములే క్షేమం' అని ముగించాడు.

★